# వింత అనుభవం

**1981** డిసెంబరు 7వ తేదీ ఉదయం ఏడు గంటల సమయం.

అది రాజస్తాన్, జిల్లా అజ్మేర్. ఊరు కిషన్‌గఢ్. గాంధీ నగరంలోని ఒక ఇంటిలో ఇంటి యజమాని ఖురైషీ కుటుంబ సభ్యులతో కూర్చొని టీ తాగుతున్నాడు. ఖురైషీ స్నేహితుడు దీన్‌మొహమ్మద్ వచ్చాడు. అతను ప్రవేశిస్తూనే వంటింటిని ఆనుకొని ఉన్న గదిలోనుంచి పొగ రావడం చూశాడు.

''ఏరా? ఇవ్వాళ ఎన్ని అగర్ బత్తీలు వెలిగించారేమిటి! గదిలో నుంచి అంత పొగ వస్తోంది?" ఆశ్చర్యంగా అడిగాడు మొహమ్మద్.

"అరే ఎవరూ ఊదు వత్తులు వెలిగించలేదే! పొగ ఎలా వస్తోంది?'' అంటూ ఖురైషీ పొగ వస్తున్న గది వైపు పరుగుతీసాడు. స్నేహితులిద్దరూ గదిలో కల్పించిన దృశ్యం చూసి గాభరాపడ్డారు.

ఖురైషీ మూడేళ్ళ కొడుకు మంచంమీద నిద్రపోతున్నాడు. అతని మీద రోజాయి కప్పివుంది. పక్కమీద పరచిన వల్చటి పరుపు ఓ మూలగా మండుతున్నది. ఖురైషీ ఓ చెంబుడు నీళ్ళు పోశాడు. అంతే. మంట ఆరిపోయింది. ఆవార్త సాయంకాలం అయ్యేసరికి ఆప్రాంతం అంతా వ్యాపించింది.

ఆదే రోజు రాత్రి ఖురైషీ భోజనాలు ముగించి కుటుంబ సభ్యులతో కబుర్లు చెబుతున్నాడు. అకస్మాత్తుగా బయటి వాకిట్లో నుంచి ఏదో

వెలుతురు కన్పించింది. అందరూ బయటికి వచ్చారు. ఇంటి కప్పు ఓ మూల మండుతోంది. నీళ్లు పోసి ఆర్పేశారు. అప్పటికే చాలా మంది ఇరుగుపొరుగు చేరారు. ఉదయం జరిగిన సంఘటన గురించి ఖురైషీ పెద్దగా పట్టించుకోలేదు. మళ్ళీ ఇంటి కప్పుకు నిప్పు అంటుకోవడంతో అందరూ ఆ విషయాన్ని గంభీరంగానే తీసుకున్నారు. ఖురైషీకి దిగులు పట్టుకున్నది. ఈ రెండు సంఘటనలను గురించి మాటాడుకుంటూ చాలా మంది ఇంటిముందు కూర్చొని వున్నారు. చలిమంట వేసుకొని చుట్టూ కూర్చున్నారు. అంతలో యింటి కప్పుమీద నుంచి మళ్ళీ మంటలు లేచాయి. ఆ వెలుగుకు అక్కడ వున్నవాళ్ళ కళ్లు చిడతలారిపోయాయి.

అందరూ గబగబా నీళ్ళు తెచ్చి మంటను ఆర్పారు. ఎవరు యిలా నిప్పు పెడుతున్నారు? ఎలా చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు? అనే ప్రశ్నలకు ఎవరికీ సరైన సమాధానం దొరకడం లేదు. తెల్లవారు ఝాము వరకూ అందరూ ఇంటిముందు కూర్చున్నారు. మళ్ళీ ఎలాంటి దుర్ఘటన జరగలేదు.

రెండో రోజు పదకొండు గంటలకు ఖురైషీ పెద్దకొడుకు నిద్ర పోతున్న గదిలో నుంచి పొగ రావడం గమనించారు. అందరూ అరుస్తూ ఆ గదిలోకి వెళ్ళారు. ఖురైషీ పెద్దకొడుకు ఏదో కంపెనీలో పని చేస్తున్నాడు. రాత్రంతా డ్యూటీ చేసివచ్చి పడుకున్నాడు. అతను కప్పుకొని ఉన్న రోజాయి ఓ మూల కాలుతూ వున్నది. స్టాండుమీద వేసి వున్న ఖురైషీ భార్య సుగరా బేగం దుపట్టా (రెండు బుజాలమీద నుంచి చాతీని కప్పుతూ వేసుకొనే ఓణి) కూడా కాలుతున్నది. అందరూ గబ గబా మంటలు ఆర్పారు.

ఆ కుటుంబ సభ్యుల్లో భయం బయలుదేరింది. ఖురైషీకి మతి పోయినట్టే ఉన్నది. ఏదో అతీత శక్తి వల్ల ఇలా జరుగుతున్నదని

అందరికీ నమ్మకం కలిగింది. ఎవరో తమ కుటుంబం మీద మంత్ర శక్తిని ప్రయోగించారనే నిశ్చయానికి వచ్చారు.

అదేరాత్రి దాదాపు పన్నెండు గంటల ప్రాంతంలో "బాబూజీ లే! లే! దీపావళి దీపాలు వెలుగుతున్నాయ్, చూడు" అంటూ కురైషీ రెండో కొడుకు పదేళ్ళవాడు అరుస్తూ లేచాడు.

అందరూ తృళ్ళిపడి లేచారు. వంటింటి చూరుమీద జానెడు జానెడు దూరంలో కొన్నిజ్వాలలు (దీపపు జ్వాలలు లాగే) కనిపించాయి. వాళ్ళంతా భయం భయంగా చూస్తూ ఉండగానే ఆ జ్వాలలు ఆరి పోయాయి. ఇక ఆరాత్రి ఎవరూ నిద్రపోలేదు. తెల్లవారి ఇల్లు వదిలేసి బంధువుల యింటికి వెళ్ళిపోయారు.

రెండో రోజు మధ్యాహ్నం కురైషీ ఇల్లు ఎలావుందో చూడాలని వచ్చాడు. ఇంటి కప్పు ఓమూలగా వెలిగించి వదేసిన సిగరెట్ కాలు తున్నట్టుగా కాలుతున్నది. సన్నగా పొగవస్తున్నది. వెంటనే నీళ్ళు పోసి అగ్గిని అర్పేశాడు. ఇల్లు వదిలేసినా అగ్ని సంఘటనలు జరుగు తూనే వున్నాయి. తను లేకపోతే పూర్తిగా ఇల్లే దగ్ధం అయిపోవచ్చును! అనుకుంటూ కురైషీ ఇల్లు ఖాళీ చెయ్యాలనే అభిప్రాయాన్ని మార్చు కున్నాడు కుటుంబ సభ్యులందరూ తిరిగి వచ్చేశారు.

ఆ రోజు మరే సంఘటనా జరగలేదు.

రెండో రోజు మధ్యాహ్నం సుగరాబేగం సెల్వార్ కమీజ్ భగ భగ మండిపోయాయి. అంతవరకూ వ్యక్తుల మీదకు రాలేదు అగ్ని. డిసెంబరు 11న సుగరాబేగం బయట కూర్చుని పొరుగింటి ఆడవాళ్లతో మాట్లాడుతున్నది. అదే సమయంలో ఆమె వంటి మీది దువట్టా ఒక వక్క కొంగునుంచి పొగరావడం ప్రారంభం అయింది. అదిచూసి ఆమెతో మాట్లాడుతున్న ఆడవాళ్లు అరిచారు. సుగరాబేగం మీదనున్న

దుప్పట్లను లాగి దూరంగా విసిరేసి అరుస్తూ దూరంగా పరిగెత్తింది. తెల్లవారి ఆమె స్నానం చేస్తున్నప్పుడు ఆమె దుస్తులు (చిలక కొయ్యకి వేలాడుతున్నవి) భగ్గున మండిపోయాయి.

డిసెంబరు 13 వ తేదీన విచిత్రమైన సంఘటన జరిగింది. దుస్తులు కాలుతున్న వాసన వచ్చింది. అన్ని గదులు చూశారు. ఎక్కడా ఏమీ లేదు. కానీ దుస్తులు కాలుతున్న వాసన మాత్రం వస్తూనే వున్నది. ఒక గదిలో మూడు పెట్టెలు ఒక దానిమీద ఒకటి పెట్టి వున్నవి. కుటుంబ సభ్యుల్లో ఒకరు ఆ పెట్టెల దగ్గరకు వెళ్ళారు. పై రెండు పెట్టెలోనూ యేమీ లేదు. మూడో పెట్టె తెరిచాడు పైదుస్తులు బాగానే వున్నాయ్. కింది వస్త్రాలు కాలుతున్నాయి.

ఇలాంటి వార్తలు చాలా త్వరగా వ్యాపిస్తాయని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. 14 డిసెంబరు - దాదాపు నూరు మంది పైగా జనం ఆ ఇంటి ముందు మూగారు. వాళ్ళు చూస్తుండగానే ఇంటి కప్పు మీది నుంచి మంటలు లేవడం ప్రారంభించాయి. టపాసులు పేలిన చప్పుళ్ళు కూడా అయ్యాయి. ఆ మంటలు ఆర్పుతుండగానే ఇంట్లో మంచం మీద పరచిన కింది దుప్పటి కాలసాగింది. మంచం పై దుప్పటి బాగానే వున్నాయి.

అన్ని పత్రికలూ ఈ అగ్నికాండల గురించి రాయసాగాయి. కొందరు పాత్రికేయులు స్వయంగా వెళ్ళి చూశారు. కానీ యెవరికీ యేమీ అంతుపట్టలేదు.

డీసెంబరు 16న సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్ జి. ఆర్. చౌదరి కురైషీ ఇంటి ముందు కుర్చున్నాడు. కుటుంబ సభ్యులందర్నీ జాగ్రత్తగా పరిశీలిస్తూ కూర్చున్నాడు. అంతకు ముందే ఇంట్లో కాలే

అవకాశం వున్న వస్తువుల్ని పరిశీలించాడు. ఫాస్పరస్ లాంటి పదార్థాలేమైనా వున్నాయేమోనని పరిశీలించాడు. కాని అలాంటివేమీ కన్పించలేదు. అర్ధగంట తర్వాత ఇంటిముందు అతనితోపాటు కూర్చున్న ఆడవాళ్ళు ఇంట్లోనుంచి దుస్తులు కాలుతున్న వాసన వస్తోందని చెప్పారు. చౌదరి లోపలకు వెళ్ళాడు. ఒకగదిలో వున్న సంచిలో కొన్ని వస్త్రాలు పెట్టి వున్నాయి. వాటిపైన వున్న దూది కాలుతున్నది. అది చూసి అతను కొయ్యబారిపోయాడు.

ఎంతోమంది ప్రయత్నించి ఇలా అగ్ని ప్రమాదాలు జరగడానికి కారణాలేమిటో తెలుసుకోలేకపోయారు.

కురైషీ బావమర్ది ఆ ఊళ్ళోనే వుంటున్నాడు. అతను చివరకు మాంత్రికుడుగా పేరుపొందిన హాజీ మస్తాన్ అనే అతన్ని తీసుకొచ్చాడు. మస్తాన్ ఇంటిని పరీక్షించాడు. ఇంటి ముందు కూర్చొని ఏవేవో మంత్రాలు చదివాడు. నాలుగు పేపర్లమీద యేదేదో రాసి ఇంటి నలుమూలలా పాతిపెట్టమన్నాడు. అలాగే చేశారు. ఆ తర్వాత ముఖద్వారం దగ్గర, దక్షిణంవైపు తవ్వమని ఆదేశించాడు. అలాగే చేశారు. ఒక తాయత్తు బయటపడింది. అందులో కురైషీ పేరు, 27 రోజులు అనీ, ఇంకా యేదో మంత్రంకూడా రాసి వుంది. మస్తాన్ దాన్ని కాల్పించివేశాడు.

కురైషీని పిల్చి కుటుంబ చరిత్ర అడిగాడు. అతను ఈక్రింది విధంగా చెప్పాడు-

అతను ముందు చిన్న ఉద్యోగంలో వుండేవాడు. ఆ తర్వాత విదేశం (ముస్లిం కంట్రీ) వెళ్ళాడు. అక్కడ బాగా డబ్బు సంపాదిస్తూ కొంత ఇంటికి పంపిస్తూవచ్చాడు. మధ్య మధ్య ఈ దేశం వచ్చి

పోయేవాడు. స్థలం కొని ఇల్లు కట్టించాడు. ఆయన అతి సన్నిహితుడైన ఒక బంధువుకు ఇదిచూసి కన్నుకుట్టింది. కురైషీ విదేశంలో వుండగా అతని భార్య సుగరా బేగంను ఆ బంధువులు భోజనానికి పిల్చారు. పాన్ ఇచ్చారు. పాన్ తినివస్తూ రోడ్డుమీద పడిపోయింది. ఆమెకు అంతకుముందు మూర్ఛరోగంలేదు. క్రమంగా ఆమె ఆరోగ్యం పాడవసాగింది.

మూర్ఛలు వస్తూనే వున్నాయి. విదేశం నుంచి కురైషీ వచ్చేశాడు. భార్య స్థితి చూసి బాధపడ్డాడు. ఒక మంత్రగాడు ఆమె రోగం కుదిర్చాడు. ఆమె ఆరోగ్యం బాగుపడింది. కాని ఇప్పుడు మళ్ళీ ఈ కొత్త సమస్య ప్రారంభం అయింది.

కురైషీ కథ విని హాజీమస్తాన్ తల పంకించాడు. "27 రోజుల దాకా నన్ను పిల్చి ఉండకపోతే మీ కుటుంబమే సర్వనాశనం అయి వుండేది" అని చెప్పాడు.

ఆ తర్వాత ఆ కుటుంబంలో అగ్ని సంఘటనలు ఆగిపోయాయి.

మస్తాన్ కురైషీతో సుగరాబేగం జబ్బు గురించి "మీ బంధువుల ఇంట్లో ఆమెకు పాన్ ఇచ్చారన్నావ్. అందులో మంత్రించిన వస్తువేదో పెట్టారు. అందువల్లే ఆమె జబ్బుకు గురి అయింది'' అన్నాడు.

ఏది ఏమైనా డిసెంబర్ '81 తర్వాత ఆ కుటుంబంలో ఎలాంటి అనర్థంగాని, విచిత్ర సంఘటనలుగానీ జరగలేదు.

ఇలాంటివి మన దేశంలో అనేక చోట్ల నిత్యం జరుగుతూనే ఉన్నాయి. వాటికి క్షుద్ర శక్తులను అంటగట్టి జనం భయభీతులు అవుతూనే ఉన్నారు.

ఈ విజ్ఞాన యుగంలో, మనిషి ఇతర గ్రహాల్లో మనుగడ సాగించే అవకాశాలను వెదుకుతున్న యుగంలో ఇలాంటి సంఘటనలు వెనకవున్న మోసాన్ని కనిపెట్టడానికి ఎవరూ దీక్షతో పూనుకోకపోవడం శోచనీయం.

సుగరా బేగం జబ్బు గురించే తీసుకుందాం. వాళ్ళకు అవతలి కుటుంబం మీద ముందునుంచీ అనుమానం ఉంది. పెరుగుతున్న తమ ఐశ్వర్యం చూసి ఓర్వలేకపోతున్నారనే భావం ఉంది. సుష్టుగా భోజనం చేసి, పాన్ నములుతూ ఎండలో బయలుదేరిన బేగంగారికి కళ్ళు తిరిగి ఉండవచ్చు. ఆమెకు వాళ్ళేదో మందు పెట్టారనే అనుమానం వచ్చి వుండవచ్చును. అందుకే మన పెద్దలు అనుమానం పెద్దరోగం అన్నారు. ఆ అనుమానంతోనే ఆవిడ చిక్కిపోవడం, మళ్ళీ ఎవరో మంత్రం వెయ్యగానే ఆవిడకు ఆత్మ విశ్వాసం వల్ల జబ్బు తగ్గిపోవడం జరిగి ఉండవచ్చును.

అలాగే పైన ఉదహరించిన అగ్నికాండల వెనక హాజీమస్తాన్‌ను తీసుకొచ్చిన వాళ్ళ చెయ్యి ఉండటానికి ఆస్కారం లేదా? మీరే ఆలోచించండి. ఇలాంటి సంఘటనలను గుడ్డిగా నమ్మకండి.